# రిజర్వ్‌బ్యాంకు - ద్రవ్య విధానం

స్థూల ఆర్థిక విధానాల్లో ప్రధాన అంశం ద్రవ్యవిధానం. విత్తరంగంపై ద్రవ్యవిధానం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో ఆర్థిక వ్యవస్థలో సమర్థత, పోటీతత్వం పెరిగాయి. ఈ విధానం వల్ల ప్రభావితమయ్యే ముఖ్య అంశం ద్రవ్యసప్లయ్. ధరల్లోని హెచ్చుతగ్గులు.. ఆర్థిక కార్యకలాపాల్లో ఒడిదుడుకులకు కారణమై ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. సాధారణ ఆర్థిక లక్ష్యాల సాధనలో భాగంగా 'ద్రవ్యసప్లయ్ నియంత్రణ'కు కేంద్రబ్యాంకుకు ద్రవ్య విధానం ఒక నియంత్రణ విధానంగా ఉపకరిస్తుంది. అయితే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ద్రవ్యసప్లయ్ నియంత్రణకే ద్రవ్యవిధానం పరిమితం కాకూడదు. ఆర్థికాభివృద్ధిలో భాగంగా ద్రవ్యవిధానం ధనాత్మక పాత్ర నిర్వహిస్తే అది పరిమిత ఉద్దేశాలనే నెరవేర్చుతుంది. ప్రణాళికా యుగంలో నిర్దేశిత ఆర్థిక, సాంఘిక లక్ష్యాల సాధనకు ద్రవ్యవిధానం తోడ్పడే విధంగా కేంద్రబ్యాంకు చర్యలు చేపట్టాలి.

## ద్రవ్యవిధానం-లక్ష్యాలు

''పరపతిని క్రమబద్ధీకరిస్తూ ద్రవ్యసప్లయ్‌ను అదుపులో ఉంచి... సాధారణ ధరల స్థాయిలో సుస్థిరతను చేకూర్చడం ద్వారా ఆర్థికాభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్రబ్యాంకు (ఆర్‌బీఐ) అవలంబించే విధానమే ద్రవ్యవిధానం.'' ధరల స్థిరత్వం, వినిమయ రేటు స్థిరత్వం, పూర్ణోద్యోగిత సాధించడం, అధిక వృద్ధిరేటు సాధించడం వంటివి ఈ విధాన లక్ష్యాలు. వీటిని సాధించడానికి ద్రవ్య నిర్వహణ అత్యంత అవశ్యకం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లభ్యమయ్యే వనరులను అభిలషణీయంగా వినియోగించుకుంటే జాతీయాదాయ స్థాయిని పెంచుకోవడానికి తోడ్పడుతుంది. ఈ దేశాల్లో పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేలా ద్రవ్యవిధానం ఉండాలి. వాణిజ్య బ్యాంకులు పరపతిని పెంచినపుడు చలామణిలో ఉన్న ద్రవ్యం ఎక్కువవుతుంది. తద్వారా ఉత్పత్తి, ఉద్యోగిత, ఆదాయ స్థాయి పెరిగి ద్రవ్యోల్బణ స్థితి ఏర్పడుతుంది. పరపతి తగ్గితే ఉత్పత్తి, ఉద్యోగిత, ఆదాయ స్థాయిలకు సంబంధించి ప్రతికూల పరిస్థితులు ఏర్పడి ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఎదురవుతాయి. ఆర్థిక వ్యవస్థలో సంభవించే అలజడులను రూపుమాపే శక్తిమంతమైన సాధనే ద్రవ్యవిధానం.

వినిమయ రేటులో అస్థిరత్వం అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావాన్ని చూపుతుంది. ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతుంది. వినిమయ రేటులో ఏర్పడే ఒడిదుడుకులు ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులను పరిమితం చేస్తాయి. కాబట్టి ఒక దేశం వినిమయ రేటులో స్థిరత్వం సాధించడం అవసరం. ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగిత, ఉత్పత్తి స్థాయి ఆయా దేశాల్లోని సాంకేతిక పరిజ్ఞానం, మానవ వనరులపై ఆధారపడి ఉంటుంది. పూర్ణోద్యోగిత వనరుల అభిలషణీయ వినియోగాన్ని తెలుపుతుంది. ఉత్పత్తి, ఉద్యోగితలను ద్రవ్య విధానం స్వల్పకాలంలోనే ప్రభావితం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థలో స్థిరీకరణ సాధించడంతోపాటు... ఉత్పత్తి, ఉద్యోగితల్లో ఎదురయ్యే ఒడిదుడుకులను తగ్గిస్తూ అధిక వృద్ధి సాధించడానికి ద్రవ్యవిధానం తోడ్పడాలి. ఆర్థికవృద్ధి ప్రోత్సహించడానికి ద్రవ్యవిధానం రెండు విధాలుగా దోహదపడుతుంది. ఓ వైపు సమష్టి ద్రవ్యడిమాండ్, సమష్టి వస్తు సప్లయ్‌ల మధ్య సమతుల్యత సాధించడం అంటే ధరల స్థిరత్వం సాధించడం.. మరో వైపు పొదుపు, పెట్టుబడుల పెరుగుదలను ప్రోత్సహించడంతో మూలధన సంచయనం పెరిగి ఆర్థికవృద్ధి త్వరితగతిన సాధ్యమవుతుంది.

## ఆర్థికవేత్తల అభిప్రాయాలు

ధరల స్థిరత్వం, ఆర్థికవృద్ధి, సమానత, సామాజిక న్యాయం సాధించడం, కొత్త ద్రవ్య, విత్త సంస్థలను ప్రోత్సహించడం ద్రవ్యవిధాన లక్ష్యాలుగా ఉండాలని ఎస్. చక్రవర్తి కమిటీ అభిప్రాయపడింది. ఎస్. నరసింహం అభిప్రాయంలో ''ఆర్‌బీఐ బాధ్యత పరపతి నియంత్రణొకటే కాదు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యసప్లయ్‌ను విస్తరిస్తూ బ్యాంకు పరపతి పెంచడం, పరపతి అవసరాలు తీర్చగలిగామా? లేదా? అని కేంద్రబ్యాంకు పరిశీలించాలి. అనుత్పాదక, అంచనా వ్యాపారాన్నుద్దేశించిన పరపతి తగ్గించే విధంగా ఆర్‌బీఐ విధానం ఉండాలి.'' ఇటీవల కాలంలో కేంద్రబ్యాంకు పరపతి విధానం 'నియంత్రణతో కూడుకున్న విస్తరణ'గా ఉంది. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ వై.వి.రెడ్డి అభిప్రాయంలో 'ధరల స్థిరత్వం ద్రవ్య విధాన లక్ష్యం'గా ఉండకూడదు. ద్రవ్యోల్బణాన్ని ఒక పరిమితిలో ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. రంగరాజన్ అభిప్రాయం ప్రకారం.. ద్రవ్యోల్బణాన్ని 5 నుంచి 6 శాతం వరకు అనుమతించవచ్చు. చక్రవర్తి అభిప్రాయం మేరకు అది 4 శాతంగా ఉండాలి. అనుభవపూర్వక ఆధారాల ప్రకారం మన దేశంలో ఏడు శాతం దాటిన ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలో ప్రతికూల పరిస్థితులకు కారణమైంది.

## ద్రవ్య విధాన సాధనాలు

సంస్కరణల ముందుకాలంలో ఆర్థిక ప్రణాళికల నేపథ్యంలో ద్రవ్యవిధానాన్ని త్వరితగతిన వృద్ధి లక్ష్యంతో రూపొందించారు. 1990వ దశకంలో ద్రవ్యవిధానం దృష్టి పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన పరపతి విస్తరణను సూచిస్తుంది. అవసరమైన మేర ధరల స్థిరత్వం సాధ్యమైనప్పుడు పారిశ్రామికాభివృద్ధి వేగవంతమవుతుంది. ద్రవ్య సప్లయ్ నియంత్రణలో భాగంగా.. పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు,గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను ఆర్‌బీఐ ఉపయోగిస్తుంది. వాణిజ్య బ్యాంకులు సృష్టించే పరపతి పరిమాణాన్ని, పరపతి వ్యయాన్ని... కేంద్రబ్యాంకు తన విధానాల ద్వారా ప్రభావితం చేసి, ఆర్థిక వ్యవస్థలో మొత్తం పరపతి పరిమాణాన్ని నియంత్రించడాన్ని పరిమాణాత్మక పరపతి నియంత్రణ అంటారు. పరిమాణాత్మక పరపతి సాధనాల వల్ల పరపతికి సరళత ఏర్పడు

**రిజర్వ్ బ్యాంకు – ద్రవ్య విధాన సాధనాలు**

పరిమాణాత్మక పరపతి సాధనాలు

ఎ) బ్యాంకు రేటు
బి) బహిరంగ మార్కెట్ చర్యలు
సి) నగదు–నిల్వల నిష్పత్తి

గుణాత్మక లేదా విచక్షణాత్మక పరపతి సాధనాలు

1. మార్జిన్‌లను నిర్ణయించడం
2. పరపతి రేషనింగ్
3. పరపతి నియంత్రణ
4. ప్రత్యక్ష చర్య
5. ప్రచారం
6. నైతిక ఉద్బోధ

తుంది. వివిధ ఆర్థిక రంగాలకు వాణిజ్య బ్యాంకులు ఇచ్చే పరపతిని ఏ విధంగా కేటాయించాలో.. వాటిని ఏ విధంగా, ఎటువంటి ప్రయోజనాల కోసం ఉపయోగించాలో ఆర్‌బీఐ నిర్ణయించి, దానికనుగుణంగా విధానాలను, సాధనాలను రూపొందించే పద్ధతిని గుణాత్మక పరపతి నియంత్రణ అంటారు. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఉత్పత్తుల్లో ఒడిదుడుకులు లేకుండా ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి కోసం గుణాత్మక లేదా విచక్షణాత్మక పరపతి నియంత్రణకు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే ఆర్‌బీఐ వనరులను అభిలషణీయ రంగాల వైపు మళ్లించే అవకాశం కలుగుతుంది.

## ద్రవ్యవిధానం – ఎస్. చక్రవర్తి కమిటీ

రిజర్వు బ్యాంకు ద్రవ్యవిధానంపై అధ్యయనం చేయడానికి 1982లో ప్రొఫెసర్ ఎస్.చక్రవర్తి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 1985లో నివేదికను సమర్పించింది. వనరుల సమీకరణ, వినియోగం సాంఘిక లక్ష్యాలను నెరవేర్చాలంటే ప్రణాళిక ప్రాధాన్యాలకు అనుగుణంగా ద్రవ్యవ్యవస్థ పనితీరులో స్థిరత్వం ఉండాలని అభిప్రాయపడింది. 1950–51 నుంచి 1983–84 మధ్యకాలంలో పొదుపు రేటు 10 శాతం నుంచి 23 శాతానికి పెరిగినప్పటికీ ఈ పొదుపు ప్రభుత్వ రంగంలో అవసరమైన పెట్టుబడులకు సరిపోలేదు. దీంతో ప్రభుత్వం లోటు బడ్జెట్ విధానాన్ని అవలంబించాల్సి వచ్చింది. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ ఒత్తిడులు పెరిగాయి. ఈ నేపథ్యంలో.. ద్రవ్యోల్బణం ఏర్పడకుండా ప్రణాళికా కాలంలో విత్త వనరులను సమకూర్చుకోవాలని కమిటీ అభిప్రాయపడింది. అంతకు ముందుకంటే ప్రజల, ప్రభుత్వరంగ సంస్థల నుంచి పొదుపు పెంచాలి. రెవెన్యూ రాబడులు, వ్యయ విధులను నిర్వహించడంలో ప్రభుత్వ సమర్థత పెరగాలని కమిటీ అభిప్రాయపడింది. ద్రవ్యాధికారులు ధరల స్థిరత్వానికి ప్రాధాన్యమివ్వాలి. 1970 తర్వాత ద్రవ్యసప్లయ్ పెరుగుదలకు ప్రభుత్వానికి ఆర్‌బీఐ పరపతి పెరగడమే కారణం. వడ్డీరేట్ల నిర్ణయంలో బ్యాంకులకు స్వేచ్ఛ ఉండాలని, ప్రాధాన్యతా రంగాలకు రుణాలను మంజూరు చేసే పద్ధతికి అవసరమైన యంత్రాంగాన్ని మెరుగుపర్చాలని సూచించింది. ఫలితంగా తగు పరిమాణంలో ప్రాధాన్యతా రంగాలకు రుణాలు లభిస్తాయని పేర్కొంది. బ్యాంకు పరపతిని క్యాష్ క్రెడిట్ విధానం బదులు బిల్ ఫైనాన్సింగ్ ద్వారా సమకూర్చాలని సిఫార్సు చేసింది. ద్రవ్యవిధానాన్ని అనుసరించేప్పుడు పలు పద్ధతులను సంవిధానం చేయాలని.. ఆయా రంగాల్లో మార్పులను కాలక్రమేణా ప్రవేశపెట్టాలని కమిటీ అభిప్రాయపడింది.

## ప్రాక్టీస్ బిట్స్

1. ప్రపంచంలో ఏర్పాటైన మొదటి కేంద్రబ్యాంక్ – రిక్స్ బ్యాంకు (Riks Bank) – 1656
2. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ప్రారంభం– 1694
3. ది బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ ప్రారంభం – 1800
4. మనదేశంలో ద్రవ్యవిధానం ప్రవేశపెట్టేది – ఆర్‌బీఐ
5. ఆర్‌బిఐ ఏర్పాటైన సంవత్సరం – 1935 ఏప్రిల్ 1
6. రిజర్వ్ బ్యాంక్ జాతీయీకరణ – 1949 జనవరి 1
7. కేంద్రబ్యాంకు ప్రధాన విధి అంతిమ రుణదాతగా వ్యవహరించడం అని చెప్పింది – హాట్రే
8. ప్రభుత్వానికి 'వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్' ఇచ్చేది – ఆర్‌బీఐ
9. 1982లో ద్రవ్యవిధానంపై ఏర్పాటైన కమిటీ అధ్యక్షులు – చక్రవర్తి
10. $M_1$= ప్రజల వద్ద ఉండే కరెన్సీ నోట్లు, నాణేలు + బ్యాంకుల వద్ద ఉన్న డిమాండ్ డిపాజిట్లు + ఆర్‌బీఐ వద్ద ఉన్న ఇతర డిపాజిట్లు
11. $M_3 = M_1$ + బ్యాంకుల వద్ద ఉన్న కాలపరిమితి గల డిపాజిట్లు
12. ఏ రేటు వద్ద వాణిజ్యబ్యాంకుల బిల్లులను ఆర్‌బీఐ రీ డిస్కౌంట్ చేస్తుంది? – బ్యాంకు రేటు
13. దేశంలో బహిరంగ మార్కెట్ చర్యలను నిర్వహించేది – ఆర్‌బీఐ
14. వాణిజ్య బ్యాంకులు తమ డిపాజిట్లలో కొంతభాగాన్ని ఆర్‌బీఐ వద్ద ఉంచడాన్ని ఏమంటారు? నగదు–నిల్వల నిష్పత్తి
15. రిజర్వ్ బ్యాంక్ వాణిజ్య బ్యాంకులకిచ్చే స్వల్పకాలిక రుణాలపై ఉండే వడ్డీరేటు – రెపోరేటు